పోలింగ్ ప్రశాంతం


దహెగాం: కల్వాడ పోలింగ్ కేంద్రం వద్ద గర్భిణి

- ఉదయం నుంచే ఓటర్ల బారులు
- రాత్రివరకు కొనసాగిన పోలింగ్
- బోర్లకుంటలో మొరాయించిన ఈవీఎం


దహెగాం: లగ్గాం పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు బారులు


తలోడిలో పాపతో బాలింత


ఓటేసిన కౌటాల ఎంపీపీ విశ్వనాథ్


దహెగాం: కల్వాడలో వృద్ధురాలు

దహెగాం: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ఉదయం నుంచి 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రారంభమైంది. ఆయా కేంద్రాలకు జనం బారులు తీరారు. క్యూలో నిల్చొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దహెగాం మండలంలో 25,992 ఓటర్లు ఉండగా 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలకేంద్రంలోని ఆదర్శ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పురుషులు 12,942, మహిళలు 13,050 ఉన్నారు. ఐదు రూట్లు ఏర్పాటు చేశారు. బొర్లకుంట పోలింగ్ కేంద్రంలో గంటకుపైగా ఈవీఎం మొరాయించింది. దీంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. దాని స్థానంలో మరో ఈవీఎం ఏర్పాటు చేశారు. మండలంలోని ఐనం, కల్వాడ, దహెగాం, బొర్లకుంట కేంద్రాల్లో పోలింగ్ నెమ్మదిగా కొనసాగింది. ఏటిగూడకు చెందిన కొందరు ఓటర్లు ఎడ్ల బండిపై లగ్గాంలోని కేంద్రానికి వచ్చి ఓటేశారు. కమ్మర్‌పల్లిలో 90 శాతం, బామానగర్‌లో 93, కర్జిలో 93, గొర్రెగుట్టలో 95, పెసరికుంటలో 91, పోలంపల్లిలో 92, బ్రహ్మన్‌చిచ్యాలలో 94, చిన రాస్పెల్లిలో 90, అమరగొండలో 94 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలు సందర్శన

మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప, బీఎస్పీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. పోలింగ్ సరళి తీరును కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండలంలో 86 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. చేడ్వాయి పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. ఓటు హక్కు వినియోగించుకోవడానికి పెద్ద ఎత్తున ఓటర్లు తరలిరావడంతో గందరగోళం నెలకొంది. కేంద్రంలో అధికారులు 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు.

సిర్పూర్(టి)లో..

సిర్పూర్(టి): మండలంలో 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కౌటాల సీఐ సాదిక్ పాష, సిర్పూర్(టి) ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలోని 34 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కౌటాల, తలోడి కేంద్రాలను బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. కౌటాల, గురుడుపేట్, బోదంపల్లి, గుండాయిపేట్ పోలింగ్ కేంద్రాలను కౌటాల సీఐ సాధిక్ పాషా, ఎస్సై మధుకర్, ఎన్నికల అధికారులు సందర్శించారు. ముత్తంపేట్, గుండాయిపేట్, కౌటాల కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ముత్తంపేట్ కేంద్రంలో గంట పాటు ఈవీఎం మిషన్ మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. గుండాయిపేట్, కౌటాల కేంద్రాల్లో ఈవీఎం మిషన్లు మందకొడిగా పనిచేశాయి. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీస్ బలగాలు బందోబస్తు నిర్వహించారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలోని 39 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అడెపల్లిలో 96 శాతం, చిత్తామలో 95శాతం, ఖర్జవెల్లిలో 95శాతం, హేటిగూడలో 92శాతం పోలింగ్ నమోదైంది. అక్కడక్కడ చెదురుముదురు ఘటనలు జరిగినా అధికారులు చర్యలు తీసుకున్నారు. గంగాపూర్‌లో ఈవీఎం పలుమార్లు మొరాయించడంతో ఓటర్లు వేచి చూడాల్సి వచ్చింది. చింతలమానెపల్లి, రవీంద్రనగర్ కేంద్రాల్లో ఈవీఎంలు ఆలస్యంగా పని చేశాయి. మధ్యాహ్నం సమయానికి 40శాతం పోలింగ్ పూర్తవడంతో పలు కేంద్రాల్లో నిర్ణీత సమయానికే పూర్తయింది. రవీంద్రనగర్, గంగాపూర్, చింతలమానెపల్లి కేంద్రాల్లో సాయంత్రం 4గంటలు దాటినా పోలింగ్ పూర్తి కాలేదు. ఎన్నికల సిబ్బంది ఓటర్లకు టోకెన్లు ఇచ్చి సాయంత్రం 7 గంటల వరకూ పోలింగ్ నిర్వహించారు. సీఐ సాదిక్ పాషా ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండలంలో 29 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. రెబ్బెనలో ఈవీఎం నెంబర్ 324, బెజ్జూర్ 216, 217 ఈవీఎంలు మొరాయించాయి. దీంతో కేంద్రాల్లో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. బీజేపీ అభ్యర్థి డాక్టర్ హరీశ్‌బాబు, బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప మండల కేంద్రంతో పాటు ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలో సాయంత్రం 5 గంటల వరకు 71.18 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రం నెం.11లో ఈవీఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా ప్రారంభమైంది. కోసిని కేంద్రం వద్ద ర్యాంప్ లేకపోవడంతో వృద్ధులను ఎత్తుకుని లోనికి తీసుకెళ్లారు. కోసిని, రాస్పెల్లి, గజ్జిగూడ కేంద్రాల్లో పోలింగ్ నెమ్మదిగా కొనసాగింది. భట్‌పల్లి కేంద్రం నెం.44లో ఓ ఉద్యోగి కంటి చూపు లేని వృద్ధులు బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని తెలిపినప్పటికీ సదరు ఉద్యోగి బీఎస్పీకి ఓటేయడంతో స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాతసారసాలలో కాంగ్రెస్ ఏజెంట్ ఇందూరి రవిపై బీఆర్‌ఎస్ నేతలు దాడికి పాల్పడటంతో గాయాలయ్యాయి. బాధితుడిని కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ ఆస్పత్రిలో పరామర్శించారు. పురుషులు, మహిళలకు బురదగూడలో ఒకే కేంద్రం ఉండడంతో వారికి ఇబ్బందిగా మారింది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత జంబుగ కేంద్రం నిర్మానుష్యంగా మారింది. ఈజ్‌గాంలో పోలింగ్ ముగిసిన అనంతరం బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు స్వల్ప గొడవ చోటు చేసుకోగా, పోలీసులు వారిని సముదాయించారు.


సిర్పూర్(టి): క్యూలైన్‌లో ఓటర్లు


పెంచికల్‌పేట్: చేడ్వాయిలో బారులు తీరిన ఓటర్లు


తలోడిలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు


బురదగూడలో క్యూలో ఓటర్లు


కౌటాల: గురుడుపేట కేంద్రం వద్ద బారులు


బాలాజీ అనుకోడలో మనవరాలితో వస్తున్న వృద్ధులు


చింతలమానెపల్లి: కేంద్రం వద్ద వేచి ఉన్న ఓటర్లు


తొలిసారి ఓటు వేసిన యువతులు


రవీంద్రనగర్‌లో బారులు తీరిన ఓటర్లు

క్లుప్తంగా

ఓటేశారు..


ఓటు హక్కు వినియోగించుకున్న సరస్వతి


జామినిలో ఓటు వినియోగించుకున్న ఎంపీటీసీ లటపటే మాధవ్


ఓటేసి చూపిస్తున్న దుర్గం భాస్కర్

ఆసిఫాబాద్: బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ చిర్రకుంటలో, బీఆర్‌ఎస్ నాయకురాలు సరస్వతి జన్కాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

జైనూర్: గత రెండేళ్ల క్రితం షెడ్డుపడి జామిని ఎంపీటీసీ లటపటే మాధవ్ గాయాలపాలై మంచానికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రానికి చెందిన ఓయూ జేఏసీ నాయకుడు దుర్గం భాస్కర్ గురువారం హైదరాబాద్ నుంచి సిర్పూర్(టి)కి వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గంలో 294 కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సిర్పూర్, కౌటాల, బెజ్జూరు, పెంచికల్‌పేట, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ మండలాల నుంచి ఈవీఎంలను పోలీసుల మధ్య స్ట్రాంగ్ రూంలకు చేరుకున్నాయి.

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో..

రెబ్బెన: మండలంలో 83 శాతం పోలింగ్ నమోదైంది. 37 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటును వినియోగించున్నారు. తక్కళ్లపల్లి 302 కేంద్రంలో అధికంగా 93 శాతం పోలింగ్ నమోదు కాగా, గోలేటిలోని 300 కేంద్రంలో 60 శాతం నమోదైంది. సాయంత్రం 4 గంటలకు క్యూలైన్‌లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. పలు కేంద్రాల వద్ద ఓటర్లకు వసతులు కల్పించకపోవటంతో ఇబ్బందులకు గురయ్యారు. టెంట్లు లేకపోవడంతో ఓటర్లు మండుటెండలోనే నిరీక్షించాల్సి వచ్చింది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మండలంలో కొనసాగిన ఎన్నికల సరళిని ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ వెంకటరమణ పరిశీలించారు. గంగాపూర్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని ఆదేశించారు. నంబాలలోని కేంద్రాలను డీఎస్పీ పరిశీలించారు.

తిర్యాణిలో..

తిర్యాణి: మండలంలో 74.9 ఓటింగ్ శాతం నమోదైంది. కొన్నిచోట్ల ఈవీఎం మిషన్లు మొరాయించడంతో ఓటర్లు గంటల పాటు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. మొత్తం 28 పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చింతపెల్లి, గంభీరావుపేట కేంద్రాల్లో ఈవీఎంలు పనితీరు నెమ్మదిగా ఉండటంతో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ ప్రకియ కొనసాగింది.

కెరమెరి: మండలంలో పోలింగ్ 80.27 శాతం నమోదైనట్లు ఎంపీడీవో మహేందర్ తెలిపారు. 29 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు. కాగా, కెరమెరి, గోయగాంలో సాయంత్రం 4 గంటల తర్వాత పోలింగ్ జరిగింది. క్యూలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. సాయంత్రం 4 గంటల తర్వాత వచ్చిన వారికి పోలీసులు లోనికి అనుమతించలేదు. దీంతో కాసేపు వాగ్వాదం జరిగింది.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో యువత, మహిళలు వృద్ధులు తమ ఓటును వినియోగించుకున్నారు. అన్ని కేంద్రాల్లో సుమారు 75 నుంచి 85 శాతం వరకు పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

లింగాపూర్: మండలంలోని 16 పోలింగ్ కేంద్రాలను ఆధికారులు ఏర్పాటు చేశారు. కేంద్రాలకు చేరుకుని ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. మొత్తం 79.58 పోలింగ్ శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వాంకిడి: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగాయి. కొన్ని గ్రామాల్లో రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. యువతి యువకులు మొదటి సారి ఓటును వినియోగించుకున్నారు.

మొరాయించిన ఈవీఎంలు

కాగజ్‌నగర్‌టౌన్: ఈ ఎన్నికల్లో ద్వారకనగర్‌తో పాటు పలు కేంద్రాల్లో ఈవీఎంలు పూర్తిగా మొరాయించారు. దీంతో గంట పాటు ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ చేపట్టారు. అలాగే మండలంలోని భట్టుపల్లిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి గంట పాటు ప్రయత్నాలు చేసి ఈవీఎంలను సరిచేశారు. దీంతో ఓటర్లు గంటల కొద్ది వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రత్యూష కాన్వెంట్ కేంద్రం, సంజీవయ్య కాలనీలోని ప్రభుత్వ పాఠశాల కేంద్రంలో ఈవీఎంలు పని చేయకపోవడంతో నాలుగు గంటలకు ముగియాల్సిన పోలింగ్ గంట పాటు ఆలస్యమైంది. వీరందరికి అధికారులు టోకెన్లను అందజేసి క్యూలో నిలబెట్టారు. సాయంత్రం ఏడు గంటల వరకు కొనసాగింది.


రెబ్బెన: గంగాపూర్‌లో బారులు తీరిన ఓటర్లు


రెబ్బెన: నంబాల వద్ద మండుటెండలో ఓటర్లు


కెరమెరి: వృద్ధుడిని వీల్‌చైర్‌లో తీసుకువస్తూ..


కెరమెరి: సుల్తాన్‌గూడలో వరుసలో ఓటర్లు


రెబ్బెన: వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకువస్తూ..


తిర్యాణి: చింతపెల్లి వద్ద రాత్రి 7 గంటలకు..


ఆసిఫాబాద్‌రూరల్: తొలిసారి ఓటేసిన యువతులు


ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడలో క్యూలైన్‌లో ఓటర్లు

ఓటు వజ్రాయుధం..



ఆసిఫాబాద్‌అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించడంతోనే సమాజంపై బాధ్యత పెరుగుతుంది. ఓటు వినియోగంపై ఎన్నికల సంఘం అవగాహన కల్పిస్తున్నా కానీ వందశాతం పోలింగ్ పూర్తికాలేదు. 70 నుంచి 75 శాతానికి చాలా నియోజకవర్గాల్లో దాటడం లేదు. ఓటు వినియోగించేందుకు దూరప్రాంతాల నుంచి స్వస్థలాలకు చేరుకుని ఓటేశారు. కొందరు మొదటిసారి ఓటు వినియోగించుకున్నారు.

ఓటును అమ్ముకోవద్దు



ప్రజాస్వామ్యంలో ఓటును అమ్ముకోవద్దు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా యువకులు మంచి నాయకునికే ఓటు వేయాలి. నేను హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాను. ఓటు హక్కును వినియోగించుకునేందుకు సొంత ఊరిలో ఓటు వేయడం చాలా సంతృప్తినిచ్చింది.

– పెంద్యాల శ్రీజ, బీటెక్ విద్యార్థిని, ఆసిఫాబాద్

ఓటు ఎంతో విలువైనది



ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది. ఓటు వేయడంతోనే దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా రూ.6 వేల ఖర్చుతో ఇక్కడకు వచ్చాను. ఓటు వేయడంతో నా బాధ్యత నెరవేరినట్లైంది.

– గణేశ్, ఆసిఫాబాద్

ఆనందంగా ఉంది



ఓటుహక్కు వచ్చిన తర్వాత మొదటి సారి ఓటు వేశా. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటుహక్కు వినియోగించడం జీవితంలో మరిచిపోలేని రోజుగా భావిస్తా. హైదరాబాద్‌లో బీటెక్ చేస్తున్నా. పోలింగ్ కోసం ఆసిఫాబాద్‌కు వచ్చా. ఓటు వేయడం ఆనందంగా ఉంది.

– జంజిరాల రిషిత, విద్యార్థిని, ఆసిఫాబాద్

ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైంది. మొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకున్నా. చాలా సంతోషంగా ఉంది. ఓటర్లు ప్రలోభాలకు లోనవకుండా సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలి.

– సుల్వ కావేరి, గోలేటి

ఓటుతోనే మార్పు



ప్రతిఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలి. ఓటుతోనే సమాజంలో మార్పు వస్తుంది. ఆసిఫాబాద్‌లో ఓటేయడానికి హైదరాబాద్ నుంచి వచ్చాను.

– సింగాడె అపూర్వ, ఉద్యోగి

సంతోషంగా ఉంది



రెబ్బెన నాకు మొదటిసారిగా ఓటు హక్కు రావటంతో ఈరోజు మొదటి ఓటు వేయడం సంతోషాన్ని కలిగించింది. ఓటు ప్రాముఖ్యత ఏంటో తెలిసింది.

– మార్మారి కళ్యాణి, గోలేటి


రెబ్బెన: గంగాపూర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ


వాంకిడి: ఓటు వినియోగించుకున్న యువతులు


వాంకిడి కేంద్రంలో క్యూలో ఓటర్లు


కెరమెరి: పోలీసులతో ఓటర్ల వాగ్వాదం

తొలి ఓటు వేశారు..

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లా కేంద్రానికి చెందిన పలువురు యువతీ యువకులు తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్న వారు స్వగ్రామాలకు వచ్చి ఓటేశారు.


ఓటేశాక.. అక్కాతమ్ముడు హారిక, వంశీ


మసాదే నాగలక్ష్మి


బీటెక్ విద్యార్థి బోనగిరి విక్రాంత్


సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మంతెన అనురాగ్